## అమెరికా వర్సిటీతో ఓయూ ఒప్పందం

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ క్యాంపస్ బీఈడీ కాలేజీ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నోటర్ డామ్‌తో పరస్పర అవగాహన ఒపందాలు కుదుర్చుకున్నాయి. ఈ రెండు వర్సిటీలు గ్లోబల్ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ది హోల్ చైల్డ్ సంస్థ ఇక నుంచి పనిచేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు, అధ్యాపకులు పరస్పర మార్పిడితో పాటు ఉమ్మడి పరిశోధనలకు ఉపయోగపడుతుందని వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొ.నీల్ బుత్‌టి, ఎంఎయూ కమిటీ చైర్మన్ ప్రొ.కిషన్, డీన్ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్ ఇతర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి విషయంలో వెనకడుగువేయం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

**బౌద్ధనగర్:** అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయమని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని రామాలయం వద్ద సీసీ రోడ్ పనులను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న రేషన్ షాప్ ను తనిఖీ చేశారు.

## ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ జీఎస్‌గా మురళీకృష్ణ



వేగి మురళీకృష్ణ

**సికింద్రాబాద్:** సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా వేగి మురళీకృష్ణ నియమితులయ్యారు. సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య అధ్యక్షతన సికింద్రాబాద్‌లో రెండు రోజుల పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్లకు చెందిన ఎంప్లాయిస్ సంఘ్ కార్యకర్తలు, నాయకులు, వర్కింగ్ కమిటీ మెంబర్స్ సర్వసభ్య సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో భాగంగా గురువారం సంఘ్ నాయకులు వేగి మురళీకృష్ణను డిప్యూటీ డిజిటల్ సెక్రటరీగా నియమించినట్లు మర్రి రాఘవయ్య ప్రకటించారు.

## శస్త్ర చికిత్స కోసం ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ నియోజకవర్గం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన మైత్రి చేతన్‌కార్తీక్ శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షలను సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ మంజూరు చేయించారు. చేతన్ కార్తీక్ అనారోగ్యంతో సతమతమవుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పరిస్థితిని సీఎం కార్యాలయానికి సిఫారసు చేసి వైద్య ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేయించారు. గురువారం చికిత్స నిమిత్తం మంజూరైన నిధుల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాలను చేతన్‌కార్తీక్ కుటుంబ సభ్యులకు అందించారు.

## ఫ్లై ఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టడంపై హర్షం

**రహమత్‌నగర్ :** శిల్పారామం ఫ్లైఓవర్‌కు సీఎల్‌పీ లీడర్, మాజీ మంత్రి పీజేఆర్ పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానీ శంకర్ పేర్కొన్నారు. రహమత్‌నగర్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షాన ఎనలేని పోరాటం చేసి, ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన పీజేఆర్ నగరవాసుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారని, ఆయన సేవలను గుర్తించడంతో కాంగ్రెస్ శ్రేణులు, పీజేఆర్ అభిమానుల్లో ఆనందం నింపిందన్నారు.

## నీటి సమస్య పరిష్కరించాలని వినతి

**శ్రీనగర్ కాలనీ:** నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు జలమండలి జీఎం ప్రభాకర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ బీజేపీ కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కల్యాణ్‌నగర్ వెంచర్-3 కాలనీలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీరు సరాఫర అవుతోందని దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారన్నారు. జీఎం సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

# లష్కర్ నాలాలు.. తప్పని బాధలు

- నాలాల్లో మొక్కుబడి పనులతో సరి!
- పునర్నిర్మాణం చేయరు.. పూడిక తీయరు...
- ముంపుతో స్థానికుల్లో టెన్షన్



మహ్మద్‌గూడ నాలాలో పేరుకుపోయిన పూడిక

**సికింద్రాబాద్:** భారీ వర్షాలు కురిసిన ప్రతీసారి పరివాహక ప్రజలను సికింద్రాబాద్ నాలాలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏటా పూడికతీత పనులు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నా మూడు ప్రాంతాల్లో నాలాలు పొంగడం, లోతట్టు ప్రాంతాల జనవాసాల్లోకి వరదనీరు చేరడం పరిపాటిగా మారుతోంది. నియోజకవర్గంలోని లాలాపేట, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో మూడు ప్రధాన నాలాలు ఉన్నాయి.

☛ ప్రతీ వర్షాకాలం ముగిసేలోగా ఈ నాలాలను ఆవరించి ఉన్న నాలుగైదు బస్తీలు ముంపునకు గురవుతున్నాయి. నాలాల విస్తరణ జరుగకపోవడం, నాలా స్థలాలు ఆక్రమణలకు గురవుతుండడం ఇందుకు కారణాలుగా ఉంటున్నాయి. ఇదిలా ఉండగా నాలాపూడికతీత పనుల పేరుతో అధికారులు అసంపూర్తి పనులు నిర్వహించి మమ అనిపిస్తున్నట్లు విమర్శలున్నాయి.

### నామమాత్రపు పూడికతీత

ఏటా జరుగుతన్న మాదిరిగానే ఈ మారు కూడా పూడిగతీత పనులు సంపూర్ణంగా జరుగలేదు. వర్షాకాలం ముంచుకు వస్తున్నా నేటికీ పూడికతీత పనులు పూర్తికాకపోవడం ఇందుకు నిదర్శనం. రెండు విడతల లాలాపేట నాలాలో పూడికతీత పనులు పూర్తిచేసిన అధికారులు సీతాఫల్‌మండి డివిజన్ భవానీనగర్ నుంచి బౌద్ధనగర్ డివిజన్ పుల్లయ్యబావి వరకు ఆవరించి ఉన్న నాలాలో పూడికతీత పనులు ఒకదశ మాత్రమే పూర్తయ్యాయి.

☛ ఈ ఏడాది మార్చినెలలో కురిసిన వర్షాలకు ప్రాంతంలోని నాలా పరివాహక ప్రాంతాలు ముంపునకుగురయ్యాయి. ఇందుకోసం మొత్తంగా పూడికతీత పనుల కోసం రూ. 16.5 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. త్వరితగతిన పనులు పూర్తిచేసి వర్షాలు ప్రారంభం కాకముందే ఆసాంతం పూడికతీత పనులు పూర్తిచేయాలని నిర్ణయించిన అధికారులు లక్ష్యం చేరలేదు.

### నాలా పరిస్థితి ఇదీ!

భవానీనగర్ నుంచి పుల్లయ్యబావి వరకు నెలకొన్న నాలాలో ఐదు ఫీట్లమేర చెత్త, చెదారంతో కూడిన బురద పూడిక పేరుకుపోయింది. నాలా ద్వారా వరదనీరు సాఫీగా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా రెండు డివిజన్ల పరిధిలోని భవానీనగర్, అన్నానగర్, ఉప్పరిబస్తీ, మమ్మద్‌గూడ, షాబాద్‌గూడ, నారాయణనగర్, రాజ్‌కుమార్‌నగర్, అశోక్‌నగర్, అంబర్‌నగర్, పుల్లయ్యబావి ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉంటుంది.

☛ మూడు నెలల క్రితం కురిసిన అకాల వర్షానికి నాలాల్లో వరదనీరు పొంగి నారాయణనగర్, రాజ్‌కుమార్‌నగర్, అశోక్‌నగర్, అంబర్‌నగర్, పుల్లయ్యబావి ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. రెండవ, మూడవ విడత పూడిగతీత పనులు ఇంకా చేయాల్సి ఉందని అధికారులు కాలయాపన చేస్తుండడం పట్ల లోతట్టు ప్రాంతాల ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

### విస్తరణ ప్రతిపాదనల వరకే.....

సీతాఫల్‌మండి-బౌద్ధనగర్ డివిజన్ల మధ్య నాలా పరివాహక ప్రాంతాల ప్రజలను ఏటా ముంపుకు గురిచేస్తుండడంతో నాలా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ఇందుకోసం 2022లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అదే సంవత్సరం జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో రూ. 9 కోట్ల నిధులు మంజూరు చేశారు. రెండు విడతల్లో పునర్నిర్మాణం పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు.

☛ సీతాఫల్‌మండిలో 12 అడుగుల వెడల్పు ఉన్న నాలా నారాయణనగర్ చేరే సరికి 6 నుంచి 8 అడుగులకు కుచించుకుపోయింది. కేటాయించిన నిధులతో నాలా ఆసాంతం ఒకే వెడల్పుతో ఉండేవిధంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. మూడేళ్లు గడిచిపోతున్నా నిధులు విడుదల చేయకపోవడంతో పునర్నిర్మాణం పనులు అటకెక్కాయి. ఇప్పటి జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ పదవీకాలం పూర్తయ్యేలోగా అయినా నాలాను ఆధునీకరించాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

## ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

**అడ్డగుట్ట:** ప్రజల సౌకర్యార్థం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని షెడ్యూల్డ్ కులాల సేవా సమితి గ్రేటర్ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో కేవలం సీతాఫల్‌మండిలో మాత్రమే ఆధార్ సెంటర్ ఉందని, దీంతో ఆధార్ కార్డులు, సవరణల కోసం ఇక్కడి ప్రాంత వాసులు అక్కడికే వెళ్లవలసి వస్తుందన్నారు. దీంతో కార్డులు, ఆధార్ కార్డులో సవరణల కోసం దరఖాస్తు పెట్టుకునే వాళ్లు రోజుల తరబడి కేంద్రం చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. అందువల్ల స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ వెంటనే స్పందించి నియోజకవర్గ పరిధిలో రెండు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా ప్రయత్నించాలని కోరుతున్నామన్నారు.

## ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



**అడ్డగుట్ట:** అడ్డగుట్ట డివిజన్‌లోని నార్త్‌లాలాగూడ రామ్ మందిర్ నూతన కమిటీ నియామకం గురువారం జరిగింది. కమిటీ చైర్మన్‌గా రాజారావు, సభ్యులుగా సంతోష్ చారి, శంకర్ యాదవ్, జగదీష్, శ్రీనివాస్, శివకుమార్, శైలజలను నియామితులయ్యారు. ఈ మేరకు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఈవో రవికాంత్‌ల సమక్షంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

## మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**రాంగోపాల్‌పేట్:** మోండా డివిజన్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం రెజిమెంటల్ బజార్‌లోని గురుద్వార ప్రాంతాల్లో రూ.11లక్షల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ కొంతం దీపికతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత చాలా కాలంగా ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారని త్వరలోనే మరిన్ని నిధులు మంజూరు చేసి ఎక్కడ సమస్య తలెత్తకుండా చూస్తామని హామి ఇచ్చారు. అధికారులు వెంటనే పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు బద్రినాథ్‌యాదవ్, సంతోష్ యాదవ్, అల్లాడి గౌరిశంకర్, బాబూరావు ముదిరాజ్, నాగేష్ యాద్, నందికంటి రవి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



సీతాఫల్‌మండిలో శానిటేషన్ పనులు ప్రారంభిస్తున్న డీసీ సుభాష్‌రావు, కార్పొరేటర్ హేమ

జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్‌రావు

**సికింద్రాబాద్:** పరిసరాల పరిశుభ్రతకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు కోరారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు సురేష్ థియేటర్ వద్ద శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాలను కార్పొరేటర్ సామల హేమతో కలిసి డిప్యూటీ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సర్కిల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్యం పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా రోడ్ల మీద పేరుకుపోయిన చెత్త తొలగింపు, డ్రైనేజీ లైన్లను శుభ్రపరచడం, మురుగునీటి నిల్వలు లేకుండా చేయడం, చెట్టు కొమ్మలు తొలగింపు వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ వెంకటేష్, ఏఈ కౌశిక్, శానిటేషన్ పర్యవేక్షకులు, బీఆర్‌ఎస్ నాయకులు కరాటే రాజు, శైలెందర్, కృష్ణ, అజీజ్, మహేష్, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## రూ.72 లక్షల దోపిడీ కేసులో ప్రత్యేక బృందాల గాలింపు

కేసులో 8వ బెటాలియన్ కానిస్టేబుల్ కూడా



పోలీసులు స్వాధీనం చేసుకున్న నిందితులు ఉపయోగించిన కారు

**రాంగోపాల్‌పేట్:** తక్కువ ధరకు బంగారం ఇస్తామంటూ ఓ బంగారం వ్యాపారిని కొట్టి అతని నుంచి రూ.72లక్షలు లాక్కుని పోయిన ఘటనలో ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి ఈ ఘటన జరిగిన సంగతి తెలిసిందే. బంగారం వ్యాపారం నిర్వహించే హీరారాంకు రాధేశ్యాంతో పరియచం ఉంది.రాధేశ్యాం ద్వారా ఇతని ద్వారా తక్కువ ధరకు బంగారం ఇచ్చే ముఠా పరిచయం అయింది. ఈ ముఠా సభ్యులు కిలో బంగారానికి రూ.72 లక్షలకు ఇస్తామని బేరం కుదుర్చుకున్నారు. సాయంత్రం సమయంలో శివాజీనగర్‌కు వచ్చి డబ్బు తనిఖీ చేసినట్లు చేసి కొట్టి లాక్కొని కారులు పరారయ్యారు. అయితే ఈ కేసులో ప్రధాన నిందితుడితో పాటు మరి కొంత మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దోపిడీ చేసిన డబ్బు కూడా ఇంకా పోలీసులకు దొరకలేదు. ప్రధాన నిందితుడు పట్టుబడితోనే డబ్బుతో పాటు కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉంది. మార్కెట్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా ప్రత్యేక బృంధాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. హీరారాం పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తాడని దాని కోసం అధిక మొత్తంలో నగదు నిలువ చేస్తాడని తెలిసే ఈ పథకాన్ని రచించినట్లు తెలిసింది.

**దోపిడీకి మూడు టీంలు**

బంగారం వ్యాపారి నుంచి డబ్బును దోపిడీ చేశాక వారి నుంచి ఒక్కో టీం, వారి నుంచి ఇంకో టీం ఇలా మూడు టీమ్‌లను ప్రధాన నిందితుడు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అందుకే కారులో కొద్ది దూరం వెళ్లగానే మరో టీం వీరి నుంచి డబ్బును లాక్కోగా వారి నుంచి ఇంకో టీం తీసుకుని వెళ్లినట్లు తెలిసింది. ఈ కేసులో కేశవ్ అనే 8వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ కూడా నిందితుడిగా ఉండటం గమనార్హం. ఇతనే తనకు తెలిసిన ఆటో నగర్‌లోని కారు రెంటల్స్ దగ్గర నుంచి కారును అద్దెకు తీసుకున్నాడు. పోలీసులకు వెంటనే సమాచారం తెలియడంతో కారు యజమాని కారు జీపీఎస్‌తో నిందితులు ఎక్కడ ఉన్నారని తెలియచేశాడు. దీంతో 4 నిందితులతో పాటు మరో ఇద్దరితో పాటు కారును కూడా స్వాధీనం చేసికున్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సనత్‌నగర్:** సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాల ద్వారా లబ్ది పొందిన వారు తమ పరిసరాల్లోని అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్‌రాజు పాల్గొన్నారు.

## చదువులు పూర్తి అయినా అందని సర్టిఫికెట్లు

**ఉస్మానియా యూనివర్సిటీ:** చదవులు పూర్తి చేసినా సర్టిఫికెట్లు అందుకోలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రావలసిన రూ.8000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయనందున కాలేజీల యజమానులు సర్టిఫికెట్లు జారీ చేయడం లేదన్నారు. సర్టిఫికెట్లు లేనందున విద్యార్థులుపై చదవులకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టోకెన్లు ఇచ్చి విద్యార్థుల స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని కోరారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**గాంధీఆస్పత్రి:** గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు మేరకు.. గాంధీ ఎన్‌టీపీసీ వెయింటింగ్ హాలు వద్ద బుధవారం సాయంత్రం ఓ వ్యక్తి పడున్నట్లు సెక్యూరిటీగార్డు గుర్తించి అవుట్ పోస్ట్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఎమర్జెన్సీ విభాగానికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధృవీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ గురువారం మృతి చెందింది. జీఆర్‌పీ ఎస్ఐ డి.రమేశ్ తెలిపిన మేరకు.. రైల్వే స్టేషన్ 6/7 ప్లాట్‌ఫామ్‌పై యువతి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు స్టేషన్ స్వీపర్ ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు 35 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

**మరో చోట..**

9వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఒక వ్యక్తి అసప్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు సదరు వ్యక్తి అప్పటికే అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వివరాలు పోలీసులకు లభించలేదు.

## నగలు,నగదు అపహరణ

**రహమత్‌నగర్:** పనికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని నగలు, నగదు అపహరణకు గురైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..డివిజన్‌లోని రాజ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ అతని కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు నగలు, నగదు కనిపించక పోవడంతో చుట్టుపక్కల వారిని విచారించగా గుర్తు తెలియని మహిళ ఇంట్లోకి వెళ్లగా చూశామని వారు తెలిపారు. దీంతో అదే రోజు రాత్రి బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన నేతలు

**బంజారాహిల్స్:** హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరిచందనను మాల వెలుగు సంఘం నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతమైన అధికారిగా పేరున్న హరిచందనను హైదరాబాద్ కలెక్టర్‌గా నియమించడంపై ఫిలింనగర్‌కు చెందిన మాల వెలుగు సంఘం నేతలు దండు లక్ష్మణ్‌తో పాటు సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు : ఎంపీ అనిల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**రసూల్‌పురా :** పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు తగిన విధంగా గుర్తింపు లభిస్తుందని ఎంపీ, సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో రసూల్‌పురా హెవెన్ ప్యాలెస్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ నాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తోందని అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసు కెళ్ళాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సెక్రటరీ రాజేష్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు సాంసన్‌రాజు, ముప్పిడి మధుకర్, జమీల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**రాంగోపాల్‌పేట్:** క్లాక్‌టవర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 20న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు స్టేషన్‌రోడ్ ఫీడర్ పరిధిలోని శ్రీనిధి జనత, హెచ్‌పీ పెట్రోల్ బంకు, సెయింట్ ప్యాట్రిక్స్ హైస్కూల్, నాగార్జున హెల్త్, రెజిమెంటల్‌బజార్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రైల్వే రిజర్వేషన్ ఫీడర్ పరిధిలోని పాస్‌పోర్టు కార్యాలయం, శ్రీసాయి గణేష్ లాడ్జి, రెతిఫైల్‌బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

**రసూల్‌పురా:** సికింద్రాబాద్ డివిజనల్ రాష్ట్రపతి నిలయం సబ్‌స్టేషన్ పరిధిలోని వైష్ణవిమాత, వెంకటాపురం 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సికింద్రాబాద్ కే. మురళికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటల నుండి 12.30 గంటల వరకు భాటీయ బేకరి, వెంకట్‌రావుపేట, గోపాల్ నగర్, మాధవి నగర్, ఎంఈఎస్ కాలనీ, ఎస్‌ఏఓ నారాయణపురం అదేవిధంగా మధ్యాహ్నం 2. 30 గంటల నుండి సాయంత్రం 5. 30 గంటల వరకు వెంకటాపురం, లక్ష్మినగర్, ఇందిరా నగర్, జగన్మాత టెంపుల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**సనత్‌నగర్:** ఈఎస్ఐ, ఐడీపీఎల్, మైత్రీవనం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్, శ్రీనివాస కాలనీ ఈస్ట్, 2ఆర్‌టీ, ఎస్సార్‌నగర్ బస్టాప్ వెనుక ప్రాంతం, గాయత్రీనగర్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ నివాస ప్రాంతం, హుడా కాంప్లెక్స్, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూసాపేట మెయిన్‌రోడ్డు, శ్రీరాములు థికేటర్ ఎదురు ప్రాంతం, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్, సత్యం థియేటర్ మెయిన్‌రోడ్డు, బ్లూ ఫాక్స్, ప్రైమ్ హాస్పటల్, గాయత్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

## ఫుట్‌పాత్‌లే మందుబాబులకు అడ్డా....





చిలకలగూడ, వారాసీగూడ ఫుట్‌పాత్‌లపై మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ ఒలిఫెంటా వంతెన నుంచి చికలకలగూడ వెళ్లే మార్గం, వారాసీగూడ ప్రధాన రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వెళ్లేమార్గాల్లోని ఫుట్‌పాత్‌లపై కొద్ది రోజులుగా మందుబాబులు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. రెండు మార్గాల్లోని ఫుట్‌పాత్‌లను అల్లరిచిల్లరగా సంచరించే వ్యక్తులు అడ్డాలుగా చేసుకుంటున్నారు. పీకల దాకా మద్యం తాగడం.. మాదక ద్రవ్యాలను వినియోగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అతిగా మద్యంతాగిబ గొడవలకు పాల్పడుతూ అవే ఫుట్‌పాత్‌లపై సేదతీరుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తమ ఇంటి ముందు మద్యం తాగడం, గొడవలు ఏంటని ప్రశ్నించిన ఇంటి యజమానులపై గొడవలకు దిగుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిలకలగూడ, వారాసీగూడ పోలీసులకు స్పందించి ఫుట్‌పాత్‌లపై అల్లరిచిల్లరగా తిరిగే వ్యక్తుల సంచారాలను అదుపుచేసి తమకు రక్షణ కల్పించాలని ఇరు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



